దేవస్థానపు శ్రీవారి ఆలయాధికారి శ్రీ ఆర్. జి. నారాయణరాజు మూడవరోజు కార్యక్రమమునకు అధ్యక్షత వహించారు. అన్నమాచార్యులు పురందరదాసు త్యాగరాజులవంటి అవతారపురుషులలో ఒకరని ఆయన సాహిత్యమువలననే స్వామివారికి ఇంతటి ప్రచారము లభించినదని పేర్కొన్నారు. రిటైర్డు జిల్లా జడ్జి శ్రీ కె. యం. కృష్ణమూర్తి, అన్నమాచార్యుల రచనల సంగీత సాహిత్య విశేషములను గూర్చి, శ్రీ జి. రామసుబ్బశర్మ కీర్తనలలోని శృంగార ఆధ్యాత్మిక తత్వములనుగూర్చి ఉపన్యసించారు. చలనచిత్ర ప్రపంచమున ప్రఖ్యాతనేపథ్య గాయకులు సర్వశ్రీ కె. మల్లిఖార్జునరావు, యస్. రాజేశ్వరరావుల కచ్చేరీలు ఆశేష ప్రజానీకమును ఆకర్షించినవి. తరువాత పుదుక్కోటై కృష్ణమూర్తి వారి బృందము శ్రీ చిత్తూరు సుబ్రహ్మణ్యముల సంగీతకచ్చేరీలతో ఉత్సవములు దిగ్విజయముగా సమాప్తమయినవి.

ఈ మూడురోజులుపాటు జరిగిన కార్యక్రమములో సర్వశ్రీ పి. పి. సోమయాజులు, జి. షణ్ముగానందం, కె. సుబ్రమణ్యం, ఎ. నారాయణ, పి. మునిరత్నం, బి కృష్ణారెడ్డి, యం సత్యనారాయణ, యం. నారాయణస్వామి, యం. రామయ్యి. పి. మునిరామయ్య, బి. రాజగోపాల్, పి. ఆర్. రామనాథం, కె. మునిరాజులు, కె రామస్వామి, టి. కృష్ణమూర్తి ప్రభృతులు వివిధవాద్యములతో ఈకార్యక్రమమున సహకరించి జయప్రదమొనర్చిరి.

సుప్రభాతపు రికార్డులు.

శ్రీమతి ఎం. ఎస్. సుబ్బలక్ష్మితమ "వెంకటేశ్వర సుప్రభాత"పు రికార్డులపై రాయల్టిని దేవస్థానపు నియమ అధ్యయన విద్యార్థి నిధికి దానముచేయగా ఇందుమూలముగజూన్1971నాటికిరు.1,20,526-53 ఆదాయమువచ్చినది.

దేవస్థాన సమాచారకేంద్రము.

యాత్రికుల సౌకర్యమునకుగాను తిరుమల తిరుపతి దేవస్థానముచే బొంబాయిలోని ఫన్సవాడి ప్రాంతమున దేవస్థాన సమాచార కేంద్రమును నెలకొల్పబడినది. శ్రీ వేంకటేశ్వరస్వామివారి శ్రీ పద్మావతివార్ల వర్ణచిత్రములు, క్యాలండర్లు దేవస్థాన గ్రంథములు సప్తగిరి మాసపత్రిక ఇచ్చట విక్రయించబడును. తదితర వివరములకు శ్రీ యస్. సంపత్‌కుమార్ అయ్యంగార్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానము, ఫన్సవాడి, బొంబాయి-2. అను విలాసమునకు వ్రాయగోరెదము.

హిందూధర్మ వేసవి పాఠశాల.

24వ వార్షిక హిందూధర్మ శిక్షణా తరగతులు 6-5-72 నుండి 4 వారములపాటు దేవస్థానముచే తిరుమలలో నడుపబడును. ఇందుకు 50 మంది ఉపాధ్యాయవిద్యార్థులు జేర్చుకొనబడుదురు. ఒక్కొక్కరికి 60 రూ. లు ఉపకార వేతనము ఇవ్వబడును. శిక్షణ కాలమున ప్రముఖ పండితులచే ఉపన్యాసముండును. దేవస్థానము జరుపు రెండు పరీక్షలలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయశ్రేణి విద్యార్థులకు రూ. 15,- 10,- 5,-బహుమానముగా ఇవ్వబడును. శిక్షణలో పాల్గొను వారందరికి నివాస సౌకర్యము కల్పించబడును. ఇతరవివరములకు ప్రిన్సిపాల్, ఓరియంటల్ కాలేజి, తిరుపతి. వారికి వ్రాసి తెలుసుకొన వచ్చును.

దేవస్థానపు బడ్జెట్టు

1972-73 ఆర్థిక సంవత్సరమునకుగాను తిరుమల తిరుపతి దేవస్థానము ధర్మకర్తలమండలిచే ఫిబ్రవరి నెలలో ఆమోదము పొందిన సంవత్సర ఆదాయవ్యయ నివేదిక (బడ్జెట్) ముఖ్యాంశములు ఇవి:

సాధారణ ఆదాయము	రూ.	6,71,94,800
స్థిరాస్తులపై ఆదాయము	రూ.	46,06,000
సాధారణ వ్యయము	రూ.	4,69,27,600
స్థిరాస్తులపై వ్యయము	రూ	1,65,40,000

శ్రీవారి ఆలయము

1971-72 ఆర్థిక సంవత్సర కాలములో శ్రీవారి ఆలయమునకు క్రింది నిర్మాణ, అభివృద్ధి, కార్యక్రమములు జరిగినవి.

శ్రీవారి ఆలయగర్భగృహ వెలుపలి భాగమున (గోపురమునుండి) అంచుల వఱకు బంగారుపూతకు రూ. 12,00,000

శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి వెండిరథము రూ. 6,00,000

శ్రీ వారికి రత్నఖచిత కటి హస్తమునకు రూ. 16,00,000

శ్రీవారి ఆలయ లోపలి ప్రాకారమునకు చుట్టు స్థలపురాణపు బొమ్మల నిర్మాణమునకు రూ. 25,000

నడిమి పడికావలి తలుపులకు వెండిపూతకు రూ. 2,50,000. వెయ్యి స్తంభాల మంటపము పునర్నిర్మాణము అలంకరణలకు రూ. 2,00,000

శ్రీవారి ఆలయమునకు 1972-73 ఆర్థికసంవత్సరములో ఈ క్రింది కార్యక్రమములు చేపట్ట దేవస్థాన పాలకవర్గము నిర్ణయించినది

ముఖ్య ఆలయములోని స్తంభములకు బంగారు తొడుగు రూ. 1,00,000

శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి క్రొత్త తెప్ప నిర్మాణము రూ 1,00,000

వెయ్యి స్తంభముల మంటపంలో రామాయణకథా చిత్రముల ఏర్పాటు రు. 75,000

తిరుమల హద్దులు ఆరంభమగు చోట శాశ్వతమగు కళావిలసిత శిలాతోరణద్వారము రు. 50,000

(ఈ కార్యక్రమమునకు విరాళములు పంపదలచుకొన్నవారు పంపవచ్చును.)

శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయము తిరుపతి

1972-73 ఆర్థిక సంవత్సరములో ఈ క్రింది నిర్మాణ కార్యక్రమములు సంకల్పించబడినవి.

శ్రీ గోవిందరాజస్వామివారి మహారథ నిర్మాణము రూ. 4,00,000

రాజగోపురము పునర్నిర్మాణమునకు రూ. 1,00,000

(మొత్తము ఖర్చు 2,00,000 లలో 1,00,000 మంజూరైనది)

శ్రీ గోవిందరాజస్వామి, పార్థసారథిస్వామి ఆలయ విమానములు, అవరోహణ మండపము, పాదముఖ మండపము, కళ్యాణమండపము గోవిందరాజస్వామి ఆలయప్రాంగణములోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయవిమానముల పునర్నిర్మాణమునకు రు. 48,000. శ్రీ గోవిందరాజస్వామివారికి క్రొత్త తెప్పనిర్మాణము రూ. 19,000

పద్మావతి ఆలయము తిరుచానూరు

71-72 సం॥లో ఈ ఆలయముఖద్వార గోపురము సుమారు 1,00,000 రూ.ల ఖర్చుతో పునర్ని

ర్మింపబడినది. 72-73 సంవత్సరములో సుమారు రు. 10,000 ఖర్చులతో ఆలయ విమానము పునర్ని ర్మింపబడును.

శ్రీ కోదండరామస్వామి ఆలయము

గత సంవత్సరమున సుమారు రు. 15,000 వ్యయముతో ఈ ఆలయమునకు అలంకారములతో కూడిన కటాంజనము నిర్మింపబడినది.

శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయము

72-73 ఆర్థిక సంవత్సరములో 15,000 రూప్య. ల ఖర్చుతో ఆలయముఖ మంటపమునకు క్రొత్త కటాంజనము ఏర్పాటు చేయబడును.

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయము మంగాపురము

71-72 ఆర్థిక సం॥లో ఆలయ బహిర్ద్వార గోపురము సుమారు 55,000 రు. ల ఖర్చుతో పునర్నిర్మింపబడినది.

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయము నారాయణవరం

1972-73 ఆర్థిక సం॥లో ఈ ఆలయమునకు సంబంధించిన వివిధ విమానముల, మండపముల పునర్నిర్మాణమునకు 25,000 రు. లు కేటాయించ బడినవి.

శ్రీ వేద నారాయణస్వామి ఆలయము నాగలాపురము

1971-72 సం॥లో సుమారు 30,000 రూప్య. ల ఖర్చుతో ఆలయ గోపుర పునర్నిర్మాణము జరుగగా 72-73 సం॥లో ఆలయ విమానము, పోటు మండప ముల పునర్నిర్మాణము మరమ్మత్తులకు గాను రు. 22,000 కేటాయించ బడినవి.

ఇతర సంస్థలు

తిరుమలలోని వివిధ సత్రముల నిర్మాణము నిర్వహణకుగాను 11,50,000 రూప్య. లు కేటాయించ బడినవి. ఇదిగాక 4 వ సత్ర ప్రారంభమునకు రు. 1,00,000, లు 4 క్రొత్తబాడుగ భవనముల (కాటేజీల) నిర్మాణమునకు రు. 1,02,000 కేటాయించ బడినవి.

తిరుపతిలో రెండు కళ్యాణమండపముల నిర్మాణ మునకుగాను ఈ ఆర్థిక సంవత్సరములో 2,00,000 రూప్య. లు కేటాయించబడినవి.

ఈ క్రింద పేర్కొనబడిన వివిధప్రదేశములలో సత్రముల నిర్మాణము 72-73 వ సం॥లో సంక ల్పించ బడినది, వీనిలో కొన్నిటి పని ప్రారంభమై నిర్మాణము జరుగుచున్నది.

మహానంది(నిర్మాణములో నున్నది) రు.	2,85,000
రామేశ్వరము ,,	3,60,000
అంతర్వేది (నిర్మాణములో నున్నది) ,,	2,90,000
ద్వారక తిరుమల ,,	2,70,000
విజయవాడలో సమాచార కేంద్రము గీతాభవనము ,,	1,00,000
దేవస్థానము రెండవసత్రము కాళహస్తి ,,	1,00,000
దేవుని కడప ,,	30,000
కర్నూలులో సమాచార కేంద్రము — కళ్యాణమండపము ,,	20,000
నాగలాపురములో స్థానికులచే స్థలము సమర్పింపబడినచో భవనమునకు రూప్య.	50,000
బద్రీనాథ్‌లో సత్రము ,,	1,00,000
బెంగుళూరులో సమాచార కేంద్రము ,,	1,00,000
ఖమ్మంమెట్టులో సమాచార కేంద్రము ,,	30,000
బస్సార్‌లో ధర్మశాల ,,	50,000

(సశేషము



ఫిబ్రవరి 20 వ తేదీన ఖమ్మంమెట్టు దేవస్థాన సమాచార కేంద్రములో జరిగిన సుప్రభాత పోటీ బహుమతి ప్రదానముకు అధ్యక్షతవహించిన జిల్లా కలెక్టరు శ్రీ పార్థసారథి



బహుమతులను పంచుచున్న శ్రీమతి పార్ధసారధి

చందాదారులకు విజ్ఞప్తి



సప్తగిరి మాసపత్రిక సంవత్సరము చందా రు. 5/–

సప్తగిరిమాసపత్రిక చందాదారులలో ఈదిగువ పేర్కొన్నసంఖ్యవారి చందా 30–6–72, 31–7–72 తేదీలతో అంతమగును ఫిబ్రవరి నుంచి సంవత్సర చందా పెంచినందువలన ఈచందా ఏప్రిల్‌వరకు సరిపోవును. చందాదారులీ విషయమును గమనించి M. O. ద్వారా తమచందా పంపవలెను. మనియార్డరు కూపనునందు దిగువకనిన తమ చందా సంఖ్య పూర్తివిలాసమును పేర్కొని, త్వరలో చందా పంపనియెడల ఆ తేది దరిమిలా పత్రిక పంపబడదు.

30–6–72 తేదీకి అంతమగు దిగువ చందాసంఖ్య వారు రు. 5–00 M. O. ద్వారా పంపవలయును.

5, 10, 53, 70, 84, 86, 90, 110, 111, 130. 135 136, 142. 149, 195, 211, 295, 299, 301, 305, 373 398, 399, 473, 478, 504, 507, 512, 525, 526, 630 633, 634, 635, 636. 637, 815, 857, 859, 861, 864 865, 867, 870, 874. 877, 878.

1058, 1210, 1214, 1220, 1222, 1223, 1224, 1226, 1229, 1234, 1235, 1276, 1403, 1618, 1705 1782, 1834, 1850, 1885, 1888, 1963, 1980, 1986 1988. 1989, 1995, 1996, 1997, 2000.

2004, 2005, 2017, 2018, 2019, 2022, 2030, 2036 2040, 2043, 2047, 2050, 2064, 2084, 2111, 2741.

3024, 3033, 3042, 3044, 3046, 3053, 3054, 3055, 3057, 3061, 3062, 3063, 3064, 3066, 3067, 3071; 3072, 3073, 3074, 3075, 3076, 3078, 3079, 3080, 3083; 3084, 3085; 3086, 3087; 3088, 3089, 3090, 3092; 3093, 3095; 3096, 3097: 3098, 3099: 3100, 3101, 3102; 3103, 3104, 3105, 3106, 3107, 3108, 3109; 3110, 3111, 3115, 3117; 3118, 3122, 3124; 3126, 3127, 3128, 3129, 3130, 3131; 3132, 3133, 3134; 3136, 3137; 3139, 3140, 3141, 3142, 3145; 3146, 3147, 3156, 3166, 3169, 3170, 3171 3172, 3173.

31–7–72 తేదీకి అంతమగు దిగువ చందాసంఖ్య వారు రు. 4–75 M. O. ద్వారా పంపవలయును.

8, 29, 32, 33, 86, 125, 201, 203, 215, 218, 220 278, 294, 310, 348, 391, 393, 403, 530, 532, 533 534, 537, 538, 638, 639, 640, 647, 648, 649, 651 653, 803, 821, 897, 899, 900, 901, 902, 903, 904 905, 908, 910, 944.

1046, 1057, 1162, 1219, 1230, 1232, 1237, 1238, 1241, 1242, 1245, 1247, 1248, 1249, 1255 1256, 1257, 1261, 1263, 1265, 1268, 1269, 1271 1272, 1273, 1333, 1425, 1457, 1672, 1709, 1844 1983.

2014, 2038, 2041, 2048, 2062, 2065, 2068 2072, 2073 2075, 2076, 2079, 2080, 2082, 2089 2093, 2095, 2101, 2107, 2112, 2113, 2116, 2122 2124, 2127, 2165, 2183, 2184, 2272, 2281, 2377 2380, 2386, 2416, 2421, 2533, 2556, 2583, 2761 2876, 2955.

3056, 3114, 3120; 3121, 3123, 3135, 3143, 3144, 3148, 3149, 3150, 3151, 3152, 3153, 3155, 3157, 3158, 3159, 3160, 3161, 3162, 3164, 3165, 3167, 3174, 3175; 3176, 3177, 3178, 3179, 3181, 3182; 3185, 3186, 3187, 3188, 3190, 3191; 3192, 3193, 3194, 3196, 3197.

మాసపత్రికకు సంబంధించిన చందాసొమ్మును మనియార్డరు రూపమున 'సంపాదకుడు టి. టి. దేవస్థానం. తిరుపతి, అను చిరునామాకే పంపవలయును. చెక్కుద్వారాగాని, ఇతర చిరునామాలకుగాని చెల్లించబడు సొమ్ము విషయమున జరుగుగల జాప్యమునకు ఈ కార్యాలయము ఎంతమాత్రమును బాధ్యత వహించదని గమనింప ప్రార్థన.

సంపాదకుడు.



శ్రీ రామానుజుడు - విశిష్టాద్వైతము

— శ్రీ వేదం రామశాస్త్రి

విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకుడు శ్రీ రామానుజుడు క్రీ॥శ॥ 1017వ సంవత్సరమున మద్రాసునకు సమీపముననున్న శ్రీ పెరంబుదూరులో జన్మించినాడు. అతని మతసిద్ధాంతం, ఉపనిషత్తుల తీర్మానం -మనల్ని ఊర్జితపరచేవి. అంటే బ్రహ్మము సర్వ పరిపూర్ణ సచ్చిదానందం అనుటను దృఢపరుస్తుంది. బ్రహ్మసత్యం, స్వాత్మజ్ఞాన సంపన్నం, బ్రహ్మము సత్యము, జ్ఞానము ఆనందదాయకము - అనే సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. అపరిచ్ఛిన్నమగు బ్రహ్మసత్తలో స్వరూపగుణములు గలస్థితి ఇమిడి యున్నది - అనుట రామానుజుని ఆశయము. ఈ బ్రహ్మము సర్వేశ్వరుడనియే రామానుజుడు భావించును. పలయన వేదములలో చెప్పబడు సాకారదైవము ఈశ్వరుడనియు, ఉపనిషత్తుల లోని దైవము బ్రహ్మమనియు గుర్తింపబడినది.

తక్కిన ఆచార్యులును భాష్యకర్తలును శ్రుతులలో కొన్ని భాగములు సరియైనవికావని యెంచి వానిని గణింపకుండుట ఆవశ్యకమని తలంచిరి. రామానుజునకు శ్రుతుల కన్నిటికిని సమన్వయ సామరస్యములు కుదిర్చిచెప్పుట కష్టమని తోచలేదు. రామానుజుడు జగత్తును బ్రహ్మమును సమన్వయింప జూచెను. పైపైని చూచువారగు లోకాయతులు చార్వాకులు జగత్తు సత్యమని సమ్మతింతురు. కానీ దైవమును గుర్తించరు, అద్వైతులో బ్రహ్మము సత్యమందురు, జగత్తు మిథ్యయందురు. రామానుజుని సిద్ధాంతప్రకారం దేవుడు గుణవిశేషములు లేని వట్టి తత్త్వము కాడు. మరేమన సకల కల్యాణ గుణపరిపూర్ణుడు, ముఖ్యముగ కరుణామయుడు.

నిరాశచే కృంగిన భక్తునకు నిర్గుణ బ్రహ్మము వలన దుఃఖోపశమనము చేకూరి ఉత్సాహము కల్గించే ఆర్ద్రమైన కరుణాకటాక్షము లభింపదు. ఆ పరతత్త్వభావమందు దయానురాగ గుణములకు అవకాశములేదు. అట్టి బ్రహ్మజ్ఞాన తత్త్వం సామాన్య ప్రజల మనస్సులో భక్తిభావాన్ని కలిగింపజాలదు. ఇటువంటివారి సహాయార్థమే, కరుణామయుడు, భక్తవత్సలుడైన సృష్టికర్తను రామానుజుడు మనకు చూపినాడు. సత్యమునకును, శివమునకును, ఆనందమునకును మూర్తిభావమగు నారాయణుని కృపావీక్షణము భక్తుల దుఃఖవ్రణముల మాన్పును. ఈ దృక్పథము శ్రీ రామానుజుడు భగవద్గీతకు తాను రచించిన ఉపోద్ఘాతమునకు సరిపడునదిగా నున్నది.

"హరిః ఓమ్-శ్రియః ప్రతిః నిఖిలహేయ ప్రత్యనీక కల్యాణైకతానః స్వేతర సమస్తవస్తు విలక్షణానన్త జ్ఞానానందైక స్వరూపః స్వాభావికా నవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తితేయః" — లక్ష్మీపతి, హేయముల కన్నిటికిని ప్రతిభటుడు, కల్యాణగుణముల కన్నిటికినీ ఏకస్థానమైనవాడు, తనకంటె వేరైన సకల వస్తువులకంటె విలక్షణుడు. అనంత జ్ఞానానందైక స్వరూపుడు. స్వభావికములును పరిమితిగాని తన్నుమించినవిగాని లేనట్టి జ్ఞాన బలైశ్వర్య వీర్యశక్తి తేజములు కలవాడు.

ఆయన సులభుడు కూడ. "సకలమనుజ నయన విషయతాంగతః, అపారకారుణ్యా సౌశీల్యౌదార్య మహోదధిః" మానవులెల్లరకంటికి ప్రత్యక్షముగ కనబడెడివాడు. కారుణ్యమునకు సౌశీల్యమునకు ఔదార్యమునకు అపారమైన మహాసముద్రము వంటివాడు. భూభారమును నివర్తింపజేయుటను వ్యాజముగా జేసికొని రామకృష్ణాది రూపముల భువినవతరించి మనకు ఉపస్మరణీయుడు ప్రాప్యుడు నగుచున్నాడు.

ఆయన ధర్మమును స్థాపించుటకును జ్ఞానమును శ్రేయమును అనుగ్రహించు స్వభావమును నిరూపించి చూపుటకును ఆయన అధికారము ఆయన గుణములు మొదలైనవాటిని పేర్కొనుట సంప్రదాయము. ఆ మూర్తియందు మనమనస్సు లగ్నమొనర్చునప్పుడు అతని గుణములను వాని వ్యాపకమును మన మనసుకువచ్చును. గుర్తించుటకు వీలైన ఒక రూపముగా మనకంటి యెదుట కనిపించును. ఆ సాక్షాత్కార ప్రభావము మన భావనపై ప్రసరించును.

భాగవతములో "ధ్యానేన ఐశ్వరాన్‌గుణాన్" అని చెప్పబడియున్నది. ధ్యానముచేత మనస్సును భగవద్గుణములందు ఏకాగ్రమొనర్ప వీలగుననుట. ఉపనిషత్తులలో ముఖ్య సూత్రాలను క్రమబద్ధము చేయుటయే కాక, సామాన్య ప్రజలకు పూజ్యుడైన భగవద్భావమును, వేదాంతులు చింతించే నిర్గుణబ్రహ్మమును సమన్వయపరచి ఒక పూర్ణ సిద్ధాంతము రూపొందించుటకు శ్రీ రామానుజుడు చేసినకృషి ప్రధానమై యున్నది. రామానుజుడు క్రొత్తతత్త్వమును కనిపెట్టినాడని మనము తలంపకూడదు. తాను స్వయముగా దేనినైనను నిర్ణయించుచున్నట్లుగా ఆయన చెప్పుకొనలేదు. వేదములు మొదలుకొని ఆళ్వార్లచేతను, నాథముని యామునాచార్యులచేతను పోషింపబడి పెంపొందిన ఒకలక్ష్యము ఆయనలో పరిపూర్ణత నొందినది

ప్రకృతి - ఇది సత్వ రజస్తమోగుణములకు ఆధార భూతమైనది.

జీవుడు - ప్రకృతివలె జీవుడును భగవంతుని ప్రకారములలో నొకటి జీవాత్మ పరమాత్మ కంటె భిన్నముగా ఉండుచో పరమాత్మపై పరిపూర్ణముగా ఆధారపడియున్నది. జీవుడు భగవంతునకు శరీర భూతుడుగను ఉన్నాడు. ఏలయన ఆయన ఆత్మలకు ఆత్మ. అంతర్నియంత. జీవుడు జ్ఞానానంద సారుడు. జీవాత్మ భ్రాంతి సంభవముకాదు, అది నిత్యతత్త్వము, కర్తృత్వ భోక్తృత్వములుకలది.

జీవాత్మలు ముత్తెరగులవారు. సంసార బంధమెన్నడూఎరుగని నిత్యులు. సంసారమునుండి విడుపొందినవారు (ముక్తులు) సంసార బంధముననుండువారు. (బద్ధులు)

ఈశ్వరుడు: దేవుడు పరతత్త్వము. నిరవధికాతిశయాసంఖ్యేయ కల్యాణగుణ విశిష్టుడు.

మానవునకును మానవునకును గల సంబంధము ప్రతిపాదించునది నీతిశాస్త్రము. జీవునకును దేవునకును గల సంబంధము ప్రతిపాదించునది మత ధర్మ శాస్త్రము. రామానుజుని సిద్ధాంతము సకల కల్యాణగుణ పరిపూర్ణమైన పరతత్త్వమును ఈశ్వరుని ప్రతిపాదించునది. ఈశ్వరవాద రూపమగు క్రమబద్ధమైన వేదాంతమును లోకులకు సమర్పించినవారిలో రామానుజుడే ప్రథముడు. ఆయన సిద్ధాంతములకు మూలాధారములు-భాగ

వతము, పాంచరాత్రాగమము, దైవోన్మత్తులగు దివ్యశూరుల (ఆళ్వారుల) భగవదనుభవ ప్రవాహ ములగు ప్రబంధములు.

పరతత్త్వమును గూర్చిన శ్రీ రామానుజుని సిద్ధాంతమునకు మూలప్రమాణము ఉపనిషత్తులు. ఆయన ప్రతిపాదించిన ఏకేశ్వర సిద్ధాంత బీజములు వేదములలో కననగును. ఈశ్వరవాద సాకార దైవ సిద్ధాంత ప్రతిపాదనము ఉపనిషత్తులలో నిగూఢముగనున్నది. నారాయణుడే పరతత్త్వము జగదంతర్బహిర్వ్యాప్తికలవాడు. సృష్టి, స్థితి, లయములన్నిటికీ ఆధారభూతుడు.

శ్రీ రామానుజుని మతమున ముఖ్యసిద్ధాంత ములు రెండు: చిదచిత్తులకు ధారకుడు రక్షకుడు ఈశ్వరుడు. అవి రెండును ఈశ్వర పరతంత్ర ములు. చిదచిత్తులు ఈశ్వరుని కొరకే వున్నవి. సమస్తమునకును ఏకైకకారణభూతుడు భగ వంతుడే. చిద చిదీశ్వరులకు భేదము నిరాకరింప బడలేదు. కానీ తత్త్వములు మూడును కలసి ఒక్కటి యగును - అని నొక్కి చెప్పబడియున్నది. ఆయన ఆధారము, మనము ఆధేయులము. మనము అంశలము, ఆయన అంశి, మనము శేష భూతులము, ఆయన శేషి.

జ్ఞానమును భక్తియు నొక్కచేయనుట శ్రీ రామానుజుని మతము. భగవద్గీతలో వర్ణింపబడిన జ్ఞానినే శ్రీ రామానుజుడు తన శరణాగతి గద్యలో పేర్కొనును.

శ్లో॥ చతుర్విధా భజంతేమాం
జనాస్సుకృతినోర్జున
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ
జ్ఞానీచభరతర్షభ ॥

శ్లో॥ తేషాం జ్ఞానీ నిత్యయుక్త
ఏకభక్తిర్విశిష్యతే
ప్రియోహిజ్ఞానినోఽత్యర్థ
మహం స చ మమప్రియః ॥

అర్జునా! నన్ను ఆశ్రయించు పుణ్యపురుషులు నాలుగు విధములుగా నున్నారు. భయరోగాది పీడితులు, జ్ఞానాభిలాషులు, అర్థకాములు, జ్ఞానులు. ఈ నాల్గువర్గముల వారిలో నిశ్చల భక్తిమంతుడగు ఆత్మజ్ఞాని అందరికంటె శ్రేష్ఠుడు. జ్ఞానికి నేను అత్యంతముప్రియుడను, అతడును నాకుప్రియుడు.

ఆధ్యాత్మిక సాధన - భగవద్గీతలో చెప్పబడిన కర్మయోగముతో ప్రారంభమగును. కర్మయోగ మనగా ఫలాపేక్షలేని కర్మానుష్ఠానము. అందులో ఉపాసనము, తపస్సు, దానధర్మములు, క్షేత్ర యాత్ర మున్నగునవియు చేరియున్నవి. కర్మ యోగము సాధకునకు హృదయ శుద్ధిని జ్ఞాన యోగార్హతను కలిగించును. జ్ఞాన యోగమున సాధకుడు అచిత్తుకంటె భిన్నమై ఈశ్వరుని ప్రకార విశేషమైన జీవాత్మ స్వరూపమును సాక్షాత్కరించు కొనును. స్వాత్మ సాక్షాత్కారము పరమాత్మ సాక్షాత్కారమునకు భక్తికి ప్రపత్తికి అతికించు మెట్టు. భక్తిప్రపత్తులు ఈశ్వర సాక్షాత్కారమునకు ఋజుమార్గములు.

ప్రపత్తియనగా పరిపూర్ణశరణాగతి - దీని కంత రంగములారు. అనుకూల సంకల్పము, ప్రాతికూల్య విసర్జనము, మహావిశ్వాసము. దేవునే రక్షకునిగా వరించుట, దేవునకు స్వాత్మను పరిపూర్ణముగ అర్పించుట, తన్ను తనసర్వస్వము పరిపూర్ణముగ భగవదర్పితముచేయుట - ఇందలి సారాంశము.

ప్రాచీన భాగవత సిద్ధాంతమే ఆధారముగా రామానుజుడు ప్రతిపాదించిన సిద్ధాంతప్రకారం

భగవంతుడు తన్ను ఐదు రూపములలో సాక్షాత్కరించును. మొదటిది పరరూపము. ఇది నిత్య విభూతిలో వెలసియుండు నారాయణమూర్తి. రెండవది వ్యూహరూపము. ఈ రూపము వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులని నాల్గు విధములు. సృష్టికై ఉపదేశించుటకై భక్తుల పూజ లందుకొనుటకై ధరించురూపములివి. మూడవది విభవరూపము. ఇందు పరమ పురుషుడు అవతార మూర్తులుగా దర్శనమిచ్చును. నాల్గవరూపము అంతర్యామి. ఈ రూపమున దేవుడు, చరాచరముల కన్నిటికిని సుహృత్తుగా వానిహృదయము లందు వసించుచుండును. కడపటిది అర్చారూపము ప్రతిష్ఠితమైన విగ్రహము. దారితప్పిన జీవులను నిరతిశయ ప్రేమాను రాగములతో చక్కబరచి కాపాడుటే ఈరూపములన్నింటి ముఖ్యోద్దేశము.

పర్యవసానముగ సంగ్రహించి చెప్పదగిన దేమనగా ఈశ్వరవాదమును వేదాంతమును సమన్వయపరచి ఉపాసనారూపమగు వేదాంతమును లోకులకు ప్రదర్శించుటకు శ్రీ రామానుజుడే ప్రారంభకుడు. అదే విశిష్టాద్వైతమని వ్యవహరింపబడుచున్నది.

★

అన్వేషణ

**

శ్రీ పి. వి. రోహిణీకుమార్.

ఏడదాగున్నాడో
ఏడుకొండలవాడు
ఏ పాటపాడినా
దాపుకైనారాడు ॥ ఏడదా ॥

గుడిలోనిదీపాలు
కొడిగట్టుతున్నాయి—
గుండెలోపాపాలు
గూడుకడుతున్నాయి—
గోడువిడిపించమని
వేడుకున్నాగాని ॥ ఏడదా ॥

కనులకర్పూరాలు
కరగిపోతున్నాయి—
గాఢాంధకారాలు
క్రమ్ముకుంటున్నాయి—
బ్రతుకువెలిగించమని
ప్రార్థించినాగాని ॥ ఏడదా ॥

కైవల్యమార్గాలు
కాంక్షించనేలేదు—
కైమోడ్చిస్వర్గాలు
కరుణించమనలేదు
కలతతొలగించమని
కలవరించినగాని ॥ ఏడదా ॥

★

వేంకటేశ్వరా!

శ్రీ మధిర భానుమూర్తి

పాశవిక ప్రవృత్తులకు బానిసనై మనకుండ నాకు నీ
వే శరణంబు దేవ! మనవిన్ విని ప్రోవుము నన్ను, నా మనః
క్లేశములన్ని పాపు, మవలీలగ నేను భవత్పదాంబుజ
మ్మేశతథా భజించునటు లేర్పడఁ జేయుము వేంకటేశ్వరా!

స్థిరము చరమ్మటంచు విభజించుట మా యవివేక, మన్నియ
స్థిరములె, లక్ష్మిచంచలను, క్షేత్రపు హక్కుల శాశ్వతమ్ము, లీ
ధరణిని నిల్వవేమియును, తథ్యము దేవర! నీ వొకండవే
స్థిరము; నినున్ స్మరించు నటు చేయుము మర్త్త్యుల వేంకటేశ్వరా!

నీమములేని జీవనము నెయ్యము కాదని విజ్ఞులందు రో
స్వామి! భవత్కృపారస మపారముగాఁ బచరింపు మెప్పుడున్
నీమముఁ దప్పకుండఁగను నీతిగ జీవిక వెళ్ళబుచ్చు న
ట్లోముము నన్ను నీ కృపకు యోగ్యుని జేయుము వేంకటేశ్వరా!

దరిసెన మన్నదొక్కపరి ధన్యతఁ గల్గిన నెంతో పుణ్యమం
దురుగద దేవ, యింక భవదుజ్జ్వల రూపముగాంచుచున్
తిరుపతిలోన నుండి యట దేవళమందున నిన్నుఁ గొల్చుచో
స్థిరముగ మోక్షమే కలిగి తీరును నిక్కము వేంకటేశ్వరా!

నీకును నాకు మధ్యఁ జొరనీయకు మన్యుల, వారలెన్నడున్
నీకును నాకు వైరము లనేకములన్ ఘటియింపఁజూతు ర
య్యా! కరుణా సముద్రుఁడ వనాదరణమ్మునఁ జూడఁబోకు మీ
నీ కృపలేక నేను మననేరను బ్రోవుము వేంకటేశ్వరా!

అర్చాస్వరూపి శ్రీ వేంకటేశ్వరుఁడు

(గతసంచిక తరువాయి)

— శ్రీ రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు

అనగా

'ఋగ్వేదాది రూపా ద్వేదాదేవ ప్రమాణాత్సర్వజ్ఞం జగదుత్పత్తి స్థితిలయ కారణం బ్రహ్మ అవగమ్యతే నాన్యే నే సిద్ధిం భవతి'

ఋగ్వేదాది రూపములైన వేదములే సర్వజ్ఞుని జగదుత్పత్తి స్థితిలయకారణుడగు బ్రహ్మమును తెలియుటకు ప్రమాణములు అగుచున్నవి. ఇతరములు కానేరవు.

శ్రీభాష్యమందు

'విచిత్రజ్ఞాన శక్తీనాం కర్తృతా యథా గోపురాదౌ ప్రపంచేస్యాత్ బ్రహ్మశాస్త్రైక మానకమ్' ఇతి.

అయమర్థః

'కార్యభూతస్య జగతః దర్శనాత్ తత్కర్తాకశ్చిత్ ఈశ్వరస్యాత్ ఇతి అనుమానేన నశక్యతే ఈశ్వరసత్తా నిశ్చేతుం'

కార్యభూతమైన యీ జగత్తును దర్శించుటచేత దాని కర్త యొకానొక ఈశ్వరుఁడు అను యనుమానము చేత ఈశ్వరసత్తును నిశ్చయింప వలనుపడదు. దీనికింకను విపులముగాఁ జెప్పవలెనన్నచో. గోపురాది సమూహమును గాంచినపుఁ డిదియొక విచిత్రమైన జ్ఞానవంతమైన శక్తివంతమైన జీవునియొక్క కర్తృత్వమని యనుమానించినట్లుగా ఈశ్వర సత్తునుఅనుమానముచే నిర్ధారింప శక్యముగాదు. గనుక దీనికిశాస్త్రమే ప్రమాణము గావలసియున్నది. అనగా వేదమూలకముగనే బ్రహ్మసత్తును నిరూపింపవలయును.

పై వివరణము చేత శ్రీ వేంకటేశ్వరుఁడు వేద ప్రామాణ్యమగు 'శాస్త్ర యోనిత్వాత్' అను సూత్రముచే కారణముచేత నే నిర్ధారింపబడిన వాడగుచున్నాడు.

ఇచట మరియొక విషయమున్నది. 'వికటాయ' అను పదమునకు శ్రీ వేంకటేశ్వరుఁడని భాష్యకారులు నిర్వచించియున్నారు. అట్లు నిర్ధారించుటకుగల హేతువులను గూడ భాష్యమునందే తెల్పియున్నారు. అది యెట్లంటేని వికటాయ–వేంకటాయ— ఈ శబ్దము వేద మూలకముగా నిర్ధారింపబడుచున్నది.

(ఋగ్వేదములో: (8–8–13)

'అరాయికాణే వికటేగిరిం గచ్ఛ, సదాన్వేశిరిం బిఠస్య సత్వభిస్తేభిష్ట్వా చాతయామసి'—

వేదపురుషః పురుషార్థ కాముక ముద్దిశ్య అత్రహిత ముపదిశన్తి.

పురుషార్థ కాముకుఁడైన జీవునుద్దేశించి వేదపురుషుఁడీ హితము నుపదేశించుచున్నాడు.

హే అరాయి, ఐశ్వర్యహీనే, కాణే ఏకాక్షి, వికటే గిరింగచ్ఛ– వేంకటగిరిం ప్రతిగచ్ఛ, సదాన్వే–అన్వేషణం కురు, యద్వా సర్వదా అన్వేషయ. శిరిం బిఠస్య, శ్రీపీఠస్య వికటస్య సత్వభిః సాత్వికగుణైః. తేభిః తైః త్వా త్వాం చాతయామసి, చాతయామః వినాశయామః

(పా. భాష్యం 135.)

ఓ ఐశ్వర్య హీనుఁడైన జీవుడా! (ఇచట జీవునకు ఐహికైశ్వర్యముగాని యాముష్మికైశ్వర్యముగాని లేనివాడా అని యర్థము చెప్పుకోవలెను.) ఐహికైశ్వర్యరహితే ఆముష్మికైశ్వర్య రహితేవా, అనగా నే యైశ్వర్యమును లేని జీవుఁడా! జీవునుద్దేశించి పలుకబడుటచేనది యభ్యాహారముగా నయినది. ఓ, ఏకాక్షీ! ఇచట కాణేశబ్దము ఔచితీశోభితము. కారణమిది. అన్ధుఁడని వాడినచో అన్ధు డేవిధమునను గమనసామర్థ్యము లేనివాడగుటచే, ఏకాక్షి ఏదియో యొక విధమున కొంతకొంతయైనను గమనము చేయగల వాడగుటచే నిది అభిప్రాయవంతము. 'అన్ధస్య గమనే సామర్థ్యాభావాత్. కాణస్య యథాకథంచిద్గమన యోగ్యతా సంభవతీతి కాణే యిత్యుక్తమ్'

మరియును కాణేయనుటలో మరియొక విశేషము స్ఫురించుచున్నది. బాహ్యదృష్టి అంతర్దృష్టియను ద్విధాభూతమగు దృష్టులలో నేదృష్టియు లేనివాడా యనియు నన్వయింపవచ్చును. 'బాహ్యదృష్టిహీనేవా అంతర్దృష్టిహీనేవా' కనుక పైయవగుణములు గలిగిన జీవుడా! నీవు వేంకటగిరిని గూర్చి పొమ్ము — అట-శిరిం బిబస్య, శ్రీనివాసస్య, సిరి నిలయుఁడైన, సిరిని వక్షమందు నెలకొల్పుకొనియున్న శ్రీనివాసునిగూర్చి సదా అన్వేషింపుము. అచట జగత్ప్రభువగు శ్రీనివాసుని సాత్విక గుణములు నీకు (జీవునకు) గలట్టి యపకరములన్ని దొలగించి నిన్నుకాపాడును.

వేదమంత్రములలోను 'వేంకట' యను పదమునకు బదులుగా 'వికట' యని వాడబడుటను ఈ విధముగా భాష్యకారులు సమర్థించుచున్నారు.

వేదములందే దేవతలు పరోక్షప్రియులుగా వాకొనబడిరి. అదియెట్లంటేని,

'చతుర్హోతోహ వైనామైషః తం వా ఏతం చతుర్హోతగ్ంసన్తం చతుర్హోతోత్యా చక్షతే పరోక్షేణ-పరోక్ష ప్రియా ఇవహి దేవాః

ఇన్ధోహవైనామైషః తం వా ఏతమిన్ధ్రగ్ంసన్తమ్-ఇన్ద్రయిత్యా చక్షతే పరోక్షేణ

పరోక్ష ప్రియా ఇవహి దేవాః— ఇతిశ్రుతేః.

చతుర్హోతయని పలుకుటకుమారుగా చతుర్హోతయనియు ఇంధ యని పలుకుటకు మారుగా నింద్రయనియు పలుకబడుటచే దేవతలు పరోక్షప్రియులుగా పేర్కొనబడుటచే వేంకట శబ్దమునకు మారుగా వికట శబ్దము చెప్పబడి దానికి వేంకటార్థత్వ ముపపాదింపబడినది.

'దేవానాం పరోక్ష ప్రియత్వాత్ యథాచతుర్హోత ఇతి వక్తవ్యే చతుర్హోతేతి, యథేంధ ఇతి వక్తవ్యే ఇన్ద్రయితి తథా వేంకట ఇతివక్తవ్యే వికట ఇత్యుక్తమ్'

జగత్ప్రభువగు శ్రీనివాసుని సాత్విక గుణములచేత జీవుని సర్వానర్థములు పోగొట్టబడుటెట్లో తెలియజేయబడుచున్నది.

శ్రీనివాసస్య సత్వభిః పురుషైః సర్వోపచార క్రియా నిరతైః. పురుషైః సదా సన్నిధానవర్తిభిః పరమైకాన్తిభిః అన్తరంగ పురుషైరితియావత్ తథా త్వేన లోకశాస్త్రయోః ప్రసిద్ధైః తదీయై త్వాం చాతయామసి అనిష్ట నివారణం యాచాన్తం కారయామః భగవతః శ్రీనివాసస్య సన్నిధౌ తదీయైః అనిష్ట నివారణ ప్రార్థనం కారయతు మిచ్ఛామః

ఐహికాముష్మిక పురుషార్థ విరోధులను కల్గియున్నను సర్వానర్థపరిహారమువకుగాను, లక్ష్మీసంపత్తిగల వేంకటాచలమునకుఁ బొమ్ము. అచట సర్వేశ్వరుఁడగు శ్రీనివాసుని సన్నిధియందు సర్వోపచార క్రియా నిరతులును సదా సన్నిధానవర్తులున్ను, పరమైకాన్తులును, అంతరంగ పురుషులును, తదీయారాధక మహాభాగులగు శ్రీ వైఖానసులును నగువారిని త్వదీయానిష్ట నివారణము కొఱకు విన్నవించవలసినదిగాఁ బ్రార్థింపుము, వారున్నూ శ్రీనివాసుని యేకాన్త సేవాకాలమందు ఆపన్నుల యాపన్నివారణము కొఱకు త్వదీయ ప్రార్థనమును విన్పింపగాఁ జేతురు. శ్రియఃపతియును పరమ దయాళుఁడగుటచేత తత్ప్రార్థనము చెవిని బడినంతనే ఆపన్నివారణము గావించును.

ఇట్టిసంప్రదాయము నేటికిని శ్రీవారి ఏకాన్త సేవాకాలమందు గానవచ్చుట యెల్లఱెఱింగినదే.

అట్టి విశేష గుణములు గల్గి, జగద్రక్షకత్వమును వహించు, జగత్పితృవగు శ్రీ వేంకటేశ్వరునకు నమస్కారము. ఇంక పాద్మపురాణములో నీ వేంకటాద్రికిఁ గలట్టి యనేక పేళ్లను తెల్పుచున్న విధము నరయుదము.

జ్ఞానప్రదత్వముచేత దీనికి జ్ఞానాద్రియని పేరు.

సర్వతీర్థ మయమగుటచే దీనిని యుత్తములు తీర్థాద్రియనియుఁ బిలుతురు. బాహుళ్యములైన పుష్కరములీ గిరియందుండుటచే మునులు, తత్వదర్శులగు వారు పుష్కరాద్రియని పిలిచిరి.

ధర్మమే తనయభివృద్ధికై నిచట తనకు తానుగా తపమొనర్చుటచే వేదపారగు లీగిరిని వృషాద్రియని పిలిచిరి.

శాతకుంభ స్వరూపముచే దీనిని కనకాద్రి యనియు, వైకుంఠా గతుఁడైన శ్రీమన్నారాయణుఁ డిచట తప మొనర్చుటచే దీనిని వైకుంఠాద్రి యనియు, ప్రహ్లాదు ననుగ్రహించి హిరణ్యాక్షుని వధించుటచే దీనిని సింహాచలమనియు పిలువబడుచున్నది.

దేవసహాయ కారకుఁడైన హనుమంతుని జననమునకు మూలకారణమైన యాతని జననియగు నంజనాదేవి యీ గిరిపై తపమొనర్చుటచే దీనిని యంజనాద్రి యనియు, నీలుఁడను వానరేంద్రుఁ డీగిరిపై నిత్యావసితుఁడగుటచే దీనికి నీలాద్రియనియు మహర్షులు పేరునిచ్చిరి.

వేంకారోఽమృత బీజస్తు కటమైశ్వర్యముచ్యతే।
అమృతైశ్వర్య సంఘత్వా ద్వేంకటాద్రిరితిస్మృతః ॥

వేంకారమమృత బీజముగను కటశబ్దమైశ్వర్యముగను చెప్పి యీరెంటి అనగా అమృతైశ్వర్య సంఘటనము చేనిది. వేంకటాద్రియని స్మృతులు పలుకుచున్నవి.

ఇంకను శ్రీనివాసగిరియనియు, ఆనందాద్రియనియు శ్రీప్రదత్వముచేత శ్రీవాసముచేత యీగిరి శ్రీశైలమనియు పిలువబడినదయినది.

కల్పభేదముచేత నీవివిధ నామములు వివిధ కల్పములలో, యుగములలో పేరుగాంచినట్టివి. ఇంకను

సర్వపాపాని వేంప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే।
సర్వపాపదహో యస్మాద్వేంకటాచల ఇత్యభూత్ ॥

వేం శబ్దముచే సర్వపాపములున్ను కట శబ్దముచే దాహార్థమును చెప్పబడుటచే సర్వపాపములు దహింపబడుటచే వేంకటాచలమని యీగిరికి ప్రసిద్ధమైనట్టిది.

కలిదోషపరీతులును, పాపచక్షులునగు నరులకు వేంకటేశ్వరునికంటె యితరమైన శరణ్యము భువిలో లేదు.

అట్టి పితృతుల్యుండైన, జగద్రక్షకుఁడైన వేంకటేశ్వరుఁడు మనలఁ బ్రోచుగాక! ★

ఇదియేమి చిత్రమమ్మ!

— శ్రీ చలమచర్ల వేంకటశేషాచార్యులు

సిరుల నిచ్చుతల్లి ధరఁకల్పవల్లిక
యఖిల సద్గుణాల కాటపట్టు
పద్మనాభుపత్ని పద్మావతీదేవి
వరలు పురము భక్తవరులు గనుడి.

అమృతమూర్తియైన యలమేలు మంగమ్మ
కృపకనర్హులెవరు విపుల వసుధ
నట్టి మాతృమూర్తి కంజలిసేయుడీ
తరతరాల కలిమికోలత తీఱ.

మంగళంబు లిచ్చు మాలక్ష్మి మగువల
పసుపుకుంకుమలకు భద్రమొసగు
వస్తువాహనాలు మస్తుగా నొసగును
రూపమిచ్చు, బిడ్డ పాపలిచ్చు.

లక్ష్మి చలువలేక లక్షేశుడైనను
బట్టకట్టి బ్రదుకు నెట్టలేడు
దయ యొకింత చాలు ధనదుడై చెల్లును
మనుజు డతుల విభవ మాన్యుడగుచు

దొడ్డ దొరకు చెప్పు బిడ్డల కష్టాలు
తప్పులున్న నచ్చ జెప్పబూను
తప్పు చేయనట్టి యప్పురుషుని జూపు
మనుచు పతి సమక్షమున వచించు.

నీదు తనయులు కోర్కెల నీరజాక్షి!
యడిగినదె చాలంచును వడిగనిచ్చి
కొంచెమే కూర్చి నానంచు నెంచి జాల
సిగ్గుజెందెద విదియేమి చిత్రమమ్మ!

★

శ్రీ రామాయణ రహస్యరత్నావళి

(గతసంచిక తరువాయి)

— శ్రీ వంగీపురం రంగస్వామయ్యంగారు.

పిదప యుద్ధరంగమున నుభయసేనలమధ్య తనరథమును నిలుపునట్లు ప్రార్థింపఁ గృష్ణుఁడట్లే చేసెను. శత్రుపక్షములోని గురువులను బంధుమిత్రాదులనుజూచి వారినెల్లరఁ జంపి రాజ్యభోగముల ననుభవింప నిష్టపడక యుద్ధముచేయనని ధనువును బడవైచి యూరకగూర్చుండిన అర్జునునకు దేహాత్మభ్రమకలిగినదని తెలిసికొని కృష్ణుడు దేహమనిత్యమగుటచే నెంతరక్షించినను నాశమొందకతప్పదనియు నాశరహితమగుటచే నాయుధములచేఁగాని యగ్నిచేఁగాని మఱే విధమునను నాత్మ చంపఁబడదని యుపదేశించి తానై సంభవించిన ధర్మయుద్ధము పుణ్యముచేసిన క్షత్రియునకే లభించునని చెప్పి యుద్ధము చేయనంతట ధర్మముతప్పుటయేగాక శాశ్వతాపకీర్తి కలుగునని యంతకంటె నీచమెద్దియులేదని బహువిధముల జ్ఞానోపదేశముచేసి తనమాటయందుఁ బరిపూర్ణ విశ్వాసమేర్పడనందున విశ్వరూపముచూపి నమ్మకముపుట్టించి క్షత్రియ ధర్మమగు ధర్మయుద్ధము చేయించుటకై భగవద్గీత నుపదేశించెను

యుద్ధము చేయననుచు అర్జునుఁడు

కార్పణ్యదోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢ చేతాః।
యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్॥

'కార్పణ్యదోషముచే నా స్వభావము చెడినది. అందువలన ధరాధర్మ నిర్ణయము చేయలేక బుద్ధియందు మోహముదయించి నాకేది మేలుచేయునో తెలిసికొనలేకున్నాను నేను నీ శిష్యుఁడను. అంతమాత్రముగాదు. నిన్నుగురువుగ వరించి నీపాదముల నాశ్రయించి ప్రపత్తి చేయుచున్నాను.

ఇట్టి ప్రపన్నునియెడ మిక్కిలి కృపఁజూపి నిశ్చితమగు ధర్మమెద్దియో బోధించవలెనని శరణాగతి చేసెను. (ఇందువలననే యీ శ్లోకము ప్రతి యాచార్యుఁడు శిష్యునియంగీకరించుటకు ముందు వానినోటఁబలికించుట పరిపాటియైనది) ఆచార్యవరణమిదియే. శాస్త్రజ్ఞానము వేదాంత విచారము లేనందున నాకాత్మజ్ఞానము గలుగకున్నది. 'నాకాధ్యాత్మ శాస్త్రముపదేశింపుమ'ని యర్జునుఁడడిగినట్లర్థమగుచున్నది. [లోకమున కాధ్యాత్మ శాస్త్రముపదేశింపఁదలఁచి యిట్టిబంధువును, స్నేహితుఁడును, ప్రీతిపాత్రుఁడునగు శిష్యుడులభించెనేయని సంతోషముతో శ్రీకృష్ణుఁడు సకలోపనిషత్సారమగు బ్రహ్మవిద్యను సంవాదరూపము నర్జునున కుపదేశించు చున్నాఁడు.]

స్వధర్మమగు కర్మను చేయననెడు అర్జునునితో శ్రీకృష్ణుఁడు

నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయోహ్యకర్మణః।
శరీరయాత్రాపిచతే నప్రసిద్ధ్యేదకర్మణః॥

జ్ఞానమార్గముకంటెను కర్మమార్గమే శ్రేష్ఠమైనది. కర్మ బహువిధములు. క్షత్రియుఁడగు నీకు ధర్మయుద్ధమే స్వధర్మము, నీవెట్టి కర్మను చేయనందువా? అది కాని పని. అట్లున్న నీకు జీవనమైనను జరుగదు. క్రొత్తకర్మ చేయమని నేను చెప్పను. నీకభ్యాసమైన నీకు విధింపఁబడిన

నీవు కోరకున్నను సంభవించినట్టిది, వద్దనినను విడువ వీలుగానట్టి క్షత్రియ కృత్యమునగు ధర్మయుద్ధము చేయుము. ఇదివఱకు నీవుజయమును లాభమును గోరి చేసినదాని నిప్పుడెట్టి ఫలమునుగోరక యిది కర్తవ్యమని నిస్సంగుఁడవై చేయుము. నీకు మేలగును. 'నేను నీమాట వినవలెనా'యందువా ? నేనెవరో తెలిసికొని మరల నీకర్మ చేయుము.

భోక్తారంయజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ :
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాంతిమృచ్ఛతి ॥

యజ్ఞము, తపస్సు, వీనిచే నారాధింపఁబడు వాఁడనని, లోకముల కన్నిఁటికి మహేశ్వరుడనని నన్ను దెలిసికొని శాశ్వతసుఖము పొందుట కొఱకు నీకర్మను నిర్వర్తింపుము.

అహంక్రతురహంయజ్ఞః స్వధాహమహ మౌషధమ్ ।
మంత్రోఽహమహ మేవాజ్యమహగ్నిరహం హుతమ్ ॥
పితాఽహమస్య జగతః మాతాధాతాపితామహః ।
వేద్యం పవిత్ర మోంకార ఋక్సామయజురేవచ ॥
గతిర్భర్తా ప్రభుస్సాక్షీనివాస్సశరణం సుహృత్ ।
ప్రభవః ప్రళయస్థానం నిధానం బీజమవ్యయమ్॥

నేను జ్యోతిష్టోమాది క్రతువును. మహాయజ్ఞము నేనే. పితృదేవతా గణమునకుఁ బుష్టినిచ్చు స్వథను నేనే. ఔషధమును, హవిస్సును నేనే. మంత్రము నేనే, హోమముచేయఁబడు ఆజ్యమునేనే. నేనే అగ్నిని. నేనే హోమము.

ఈ స్థావర జంగమాత్మకమగు జగత్తునకు నేనే తండ్రిగను, దల్లిగను, ధరించువాఁడుగను, పితామహుడుగను వర్తించు వాఁడను. తెలియందగినదియుఁ బవిత్రమైనదియునగు ఓంకారమును, ఋగ్యజుస్సామవేదములును నేనే.

పొందఁతగిన స్థానమును, భరించువాఁడును, సాక్షాత్తుగ జూచుచుండువాఁడును వాసస్థానముగ నుండువాడును, రక్షకుఁడును, మిత్రుఁడును, ఉత్పత్తి స్థితి లయకారకుఁడును, హితైషియును, నిధానమును, నాశములేని విత్తనమును నేనే.

యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా
తత్తదేవావగచ్ఛత్వం మమ తేజోఽంశసంభవమ్.

ఇంతయేల. అనేకులకధిపతియై యుండుట, సత్యము, ఐశ్వర్యము, లేక, రూపము, బలము, మొదలగువానితోఁ గూడియుండు నవియెల్లను నేనే. నా తేజస్సువలననే యన్నియు జరుగునని తెలియుము. అన్నియు నా యంశమని భావింపుము.

యోమామేవతున సమ్మూఢోజానాతి పురుషోత్తమమ్
స సర్వవిద్భజతిమాం సర్వభావేన భారత.

ఇట్లు ఎవఁడు తెలివిగలిగి నన్ను పురుషోత్తముడని తెలిసికొనుచున్నాఁడో వాఁడు అన్నిఁయుఁ దెలిసినవాఁడు. వాఁడే నన్నుఁ బొందుటకేది యుపాయమో దానిని తెలిసినవాఁడు. వాఁడే నన్ను నా ప్రీతికొఱకు సర్వవిధముల భజించువాఁడు. ఈ సూక్ష్మము దెలియక కొందఱు

ఆఢ్యోఽభిజనవానస్మికోఽన్యోస్తిసదృశోమయా ।
యక్ష్యేదాస్యామి మోదిష్య ఇత్యజ్ఞాన విమోహితాః ॥
అనేకచిత్తవిభ్రాంతా మోహజాల సమావృతాః ।
ప్రసక్తాః కామభోగేషు పతంతినరకేఽశుచౌ ॥

నేను ధనికుఁడను, కులీనుడను, అగుచున్నాను. నాకు సమానుఁడింకొకఁ డెవడున్నాఁడు ? నేను యాగము చేసెదను. దానమిచ్చెదను, సంతోషించెదను. అని అజ్ఞానముచే మోహము చెంది నానావిధచిత్త భ్రమములు గలిగి, మోహమనెడి వలలోఁజిక్కి కామోపభోగాసక్తులై అశుద్ధమయిన నరకమునఁ బడుచున్నారు. అట్లుగాక గర్వముడిగి

మత్కర్మకృన్మత్పరమోద్భక్తస్సంగవర్జితః ।
నిర్వైరస్సర్వభూతేషు యస్సమామేతి పాండవ ॥

అర్జునా! ఎవఁడు నాప్రీతికొఱకు కర్మచేయుచు నన్నే పరదైవముగఁ దలఁచి, నాభక్తుఁడై, ఆశ లేని వాఁడయి, సకల ప్రాణులందును వైరములేని వాఁడై యుండునో వాఁడునన్నుఁబొందును.

త్రివిధం నరకస్యైతద్ద్వారం నాశనమాత్మనః।
కామః క్రోధస్తథాలోభస్తస్మాదేతత్త్రయంత్యజ॥

కామము, క్రోధము, అటులే లోభము అను మూఁడును ఆత్మనాశకరమగు నరకమునకు ద్వారములు. కనుక నీవీ మూఁడింటిని విడువుము.

అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥

ఇతరచింతలేక నన్ను తలంచుచు ఏజనులు నన్నుపాసించు చున్నారో నాతో నిత్యసంబంధము కోరునట్టి వారి యోగక్షేమములను నేను వహించు చున్నాను. (అనఁగా నాయందే భక్తిగల వారికి లేనివస్తువులనిచ్చియు, వారికున్న వస్తువులను సంరక్షించియు వారికిఁ దోడ్పడెదను. నాప్రాప్తి యనెడి యోగమును, పునర్జన్మ నివృత్తియనెడి క్షేమమును నేనే యిచ్చుచున్నాను.)

ఏకార్యమును చేయుటకును ముఖ్యముగ

అధిష్ఠానం తథాకర్తాకరణంచ పృథగ్విధమ్।
వివిధాశ్చపృథక్చేష్టాదైవంచైవా త్రపంచమమ్॥
శరీరవాఙ్మనోభిర్యత్కర్మ ప్రారభతేనరః।
న్యాయ్యంవావిపరీతంవా పంచైతేతస్యహేతవః॥

మహాభూతముల సంఘాతరూపమగు [1] శరీరము, [2] కర్తా (జీవాత్మ) (జ్ఞాతృత్వకర్తృత్వము గల వాఁడు), వేరువేరు కరణములు, చేష్టలు (ప్రాణాపానాది భేదవాయువుల వివిధవృత్తులు) దైవము (ప్రతి చేతనునిలోనున్న అంతర్యామి రూపుఁడగు పరమాత్మ-సకలకార్యములకు ప్రధాన కారకుఁడు) కావలయును.

పురుషుఁడు మనోవాక్కాయములతో న్యాయమగునది కాని, అన్యాయమగునదికాని ఏకర్మను (కార్యమును) ప్రారంభించునో దానికి ఈ ఐదును కారణములగును. వీనిలో మొదటినాలుగు మాత్రముండి ఐదవదియగు దైవము అనుకూలింపకున్నా కార్యము సఫలముగాదు. రావణాదులకు మొదటి నాలుగునుండియు దైవానుకూల్యము లేనందున వారు ప్రారంభించిన కార్యములు విఫలములయినవి యని ముఖ్యముగ నెఱుఁగవలయును. ఇట్లే దుర్యోధనాదుల కృత్యములన్నియు విఫలమయ్యెను. కృష్ణానుగ్రహము తప్పినందున వారికి వినాశ మేర్పడినది.

ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥

సకలమునకు ప్రభువగు వాసుదేవుఁడు సకల భూతముల హృదయమున (ప్రవృత్తి నివృత్తి కర్మల నాచరింప బుద్ధిపుట్టించు స్థానమున) నున్నాఁడు. అతఁడు యంత్రముల నారోహించిన మానవులను స్వకీయమగు మాయచే సత్త్వాది గుణములయందుంచి వారిని త్రిప్పుచు వారిచే సకలమును జేయించు చున్నాఁడు. అట్టిమాయ నుండి తప్పించుకొనుటెట్లనిన వినుము.

తమేవశరణంగచ్ఛ సర్వభావేన భారత।
తత్ప్రసాదాత్పరాం శాంతింస్థానం ప్రాప్స్యసిశాశ్వతమ్॥

'అర్జునా! సర్వవిధములచే ఈశ్వరునే శరణము వేడుము. (అతనియందు ప్రపత్తి చేయుటొక్కటే సులభమార్గమని నొక్కి సారాంశముగ బోధించు చున్నాఁడు. కృష్ణుఁడు.) అట్లు చేసినవచ్చు లాభ మేమందువా? వినుము.

3. పురుషార్థము :- సర్వశరణ్యుఁడగు నా ఈశ్వరుని యనుగ్రహము పొంది గొప్పశాంతిని, శాశ్వతమగు స్థానమును బొందుదువు. ఆ స్థాన మెట్టిదందువా ? 'తద్విష్ణోః పరమం పదం సదాపశ్యంతి సూరయః' ఆ విష్ణుదేవుని యుత్తమ స్థానమగు శ్రీవైకుంఠమున నిత్యకైంకర్యము చేయుచుండు నిత్యసూరులను జూతువు. నీవు నట్టి కైంకర్యము చేయుదువు. అట్టి ఈశ్వరుఁడను నేనే. కనుక

మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు।
మామేవైష్యసి సత్యంతే ప్రతిజానే ప్రియోఽసిమే ॥

నాయందే మనసుగలిగి నా భక్తుఁడవై నన్నే పూజింపుము. నాయందత్యంత వినయము పాటించుచు నాకు పలుమారు నమస్కారము చేయుము. నీవు నన్నే చేరుదువు. నీవు నాకుఁ బ్రియుఁడవు. కనుక నేను నీకును మాటసత్యమని ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాను

సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణంవ్రజ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥

కర్మ యోగ జ్ఞానయోగ భక్తియోగ సాధనముల నెల్ల ఫలకర్మకర్తృత్వాది పరిత్యాగముతో విడిచిపెట్టి సర్వకర్మ సమారాధ్యుఁడని ప్రాప్యుఁడని ప్రాపకుఁడని ధృఢముగనమ్మి నన్ను శరణుఁ జొచ్చుము. నీవు నన్ను బొందుటకు విరోధముగ నుండు అనాదికాలముగఁ జేరియుండు మేరలేని యకృత్యకరణ (చేయరానివి చేయుట) కృత్యాకరణ (చేయవలసినవానిని చేయకుండుట) రూపమగు సకల పాపములనుండి నిన్ను విడిపింతును ఇఁక నీవు శోకింపకుము. అని కృష్ణుని కట్టకడపటి యుపదేశము కనుక దీనిని చరమ శ్లోకమందురు. ఇందలి పూర్వార్థమున నుపాయమును నుత్తరార్థమునఫలమును వివరింపఁబడినది. శ్రీమద్రామాయణమున 'సకృదేవప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే। అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ, ఒక్కపర్యాయము శరణాగతి చేసి 'నేను నీదాసుఁడ'ను అనువానిని సర్వభూతములబారినుండి కాపాడెదనని యభయ ప్రదానము చేసెదను. ఇదియె నా వ్రతము. ఈ వాక్యమును

ఆనయైనం హరిశ్రేష్ఠదత్తమస్యాభయం మయా।
విభీషణోవా సుగ్రీవయదివారావణస్స్వయమ్ ॥

'సుగ్రీవా ! శరణాగతి చేసినవాఁడు విభీషణుఁడుగ నుండినను, రావణుఁడుగనే యుండినను, అట్టివాని కభయమిచ్చినాను. ఓ వానరోత్తమా ! అతనినిఁ బిలుచుకొనిరమ్ము' అనెను. ఇందువలన శరణాగతుఁడు తన్నుఁ జంపువాఁడయినను రాముడు వానిని రక్షింతునని దృఢముగఁ బల్కి దాని ననుష్ఠించి చూపెను. ఇందుచే శ్రీమద్రామాయణము వలనను, భగవద్గీతవలనను శరణాగతియే మోక్షము పొందుటకు సులభోపాయమని సుస్పష్టమగుచున్నది. కనుక శ్రీరామానుష్ఠానమే శ్రీకృష్ణోపదేశమని చెప్పవలసియున్నది.

(సశేషం)



మేలుకొలుపు

* * *

— శ్రీ నర్వా నారాయణరావు

మేలుకో! హరి! మేలుకో!
మేలుకొని మమ్మేలుకో!
వేంకటేశా మేలుకో-శ్రీ
ప్రేమమూర్తీ యేలుకో- ॥ మేలుకో ॥

సుప్రభాతము సుప్రసన్నము
సుందరంబగు ప్రకృతినిలయము
వచ్చెనదిగో! భక్తబృందము
వందనాలను స్వీకరింపుము!
విశ్వరూపా మేలుకో! ఓ
వేదవేద్యా ఏలుకో! ॥ మేలుకో ॥

మమతగొలిపెడు మంజువదనము
మధురతరమగుమందహాసము
ఆత్మలో నానందకందము
మనసులో మకరందపానము
పక్షివాహన మేలుకో! ఓ
భక్తవత్సల యేలుకో! ॥ మేలుకో ॥

అరుణరేఖలు జాలువారెను
అందమంతా ప్రకృతినిండెను
ఆదిలక్ష్మియు చెంతజేరెను
అంబమోమున అందమొలికెను
చిద్విలాసామేలుకో! ఓ
శేషశయన ఏలుకో ॥ మేలుకో ॥

ధర్మరక్షణజేయనెంచియు
ధరనుజేరితివా రమేశ!
నీదు దర్శనమాత్రముననే
నిర్మలత్వము కలుగునిజముగ!
భక్తిబీజమునాటవో! భవ
బంధములసడలింపవో!
వాసుదేవమేలుకో!
ధానురాంగ ఏలుకో! ॥ మేలుకో ॥

భక్తిలోనేశక్తిగలదని
శక్తిలోనే ముక్తిగలదని
విమలప్రేమను జూపుమనుచు
విశ్వసించుచునిన్నుజేరితి!
చింతలన్నియుబాపవో! మా
చిత్తముననివసింపవో!
నళిననేత్రమేలుకో!
నరులనందర నేలుకో! ॥ మేలుకో ॥

మనసులందలి మలినజాలము
మాపిప్రేమమధువునింపుము!
నీదుమంగళవిగ్రహంబును
నిశ్చలముగభజించనిమ్మా!
మోక్షదాతామేలుకో! మా
మొరాలించి ఆదుకో! ॥ మేలుకో ॥

ముద్దులొలికెడుమోముగలిగియు
మూడునామములనుధరించగ
ముద్దుసతియే మురిసిపోవగ
ముగ్ధులౌదురుభక్తులెల్లరు!
విశ్వమోహనమూర్తివో!
విమలప్రేమస్ఫూర్తివో!
చక్రధారీమేలుకో!
శాంతమూర్తీ ఏలుకో! ॥ మేలుకో ॥

(మిగతా 56 వపేజీ చూడుడు)

కాశ్యప జ్ఞానకాండః

(గతసంచిక తరువాయి)

— శ్రీమాన్ ఆర్. పార్థసారధి అయ్యంగార్

అథ త్రిపంచాశోఽధ్యాయః

స్థానకాసన శయన విధిః :

స్థానకమ్ — అథస్థానకాసన శయనభేదం వక్ష్యామి. విమానే గర్భగృహే ద్వైవికభాగం త్రిధా కృత్వా తదపరే తద్ద్విభాగే వా ఏకభాగే వా స్థానకం స్థాప్యమ్. ఏతద్యోగం భోగం విరహం వీర మితి చతుర్విధం భవతి. శ్రీభూమిభ్యాం రహితం దక్షిణే మునినా మార్కండేయేన, అర్చకేన వామే చ. భృగుణా సహితం దక్షిణే, భూమ్యా వామే మార్కండేయేన అర్చకేన సహితం వా యోగస్థానకం, తథా దేవీభ్యాం రహితం అర్చకేన మార్కండేయేన భృగుణాచ సహితం, దక్షిణేదండకేన వామే చ గరుడేనయుతం యోగస్థానకమితికేచిత్.

తా॥ మూలమూర్తులలోని స్థానకాసన శయనములను మూడు ప్రకారములను చెప్పుచున్నాను. అందు స్థానకమనిన, విమానమందలి గర్భగృహములో (పంచవింశతి భాగములలో నొకటియగు) ద్వైవికభాగమును మూడుగా విభజించి ఆఖరుభాగమందుగాని రెండవభాగమందుగాని స్థానకమూర్తిని అనగా నిలుచుండిన మూర్తిని ప్రతిష్ఠించునది. ఈ స్థానికమూర్తియు యోగము భోగము విరహము వీరమునని నాల్గువిధములగును. శ్రీ భూములను దేవేరు లిరువురు లేకుండా దక్షిణ వామపార్శ్వములలో మార్కండేయుడు భృగువునను నిరువురు అర్చకులతో కూడి యుండుటగాని అట్లే శ్రీ భూములులేక దక్షిణ వామము లందు భూమార్కండేయులను కూడియుండు దేవునికి యోగస్థానకమని వ్యవహారము కల్గును, అట్లే మరియొక పక్షరీతిని దేవేరులులేక దక్షిణమందు భృగుమార్కండేయులను, వామమందుదండకగరుడులచే కూడియుండు దేవునికి యోగస్థానికమని వ్యవహారము కల్గును. అట్లే మరియొక పక్షరీతిని దేవేరులు లేక దక్షిణమందు భృగుమార్కండేయులు వామమందు దండకగరుడలచే కూడియుండు మూర్తియు స్థానకమనబడును.

తథా దేవీభ్యామర్చకమునిభ్యాంచ సంయుతం భోగస్థానకమ్. ఏతైస్సర్వైశ్చ విరహితం వీరస్థానకమ్. దేవీభ్యాం రహితమర్చకమునిభ్యాం సహితం వా శంఖచక్రభ్యాం రహితం వీరస్థానకమితి.

తా॥ అటులనే దేవేరులతోడను అర్చకమునులచేతను కూడినమూర్తి భోగస్థానకమనబడును. వీర్లలో ఏవియులేని మూర్తియు శంఖచక్రములు కూడ లేని మూర్తియు వీర స్థానకమనబడును.

ఆసనమ్ తథాద్వైవిక భాగం త్రిధాకృత్వా ద్వైవిక భాగయు తమానుష్యే స్థాప్యమాసనమ్. తచ్చయోగం సుఖం భోగం వీరమితి చతుర్విధమ్. తథాదేవీభ్యాం రహిత మర్చకమునిభ్యాం మహీ మార్కండేయాభ్యాం మార్కండేయ పుణ్యాభ్యాంవా యుక్తం యోగాసనమ్. దేవ్యర్చకముని భిర్వినాకృతం తథా దేవీభ్యామర్చకమునిభ్యాం వా సంయుక్తం సుఖాసనమ్. తద్దేవీభ్యాం తన్ముని భ్యాంచ సహితమ పరభిత్త్యాశ్రయేచామరధారిణీ భ్యాం మాయాసంహ్లాదినీభ్యాం కిష్కింధ సుందరాభ్యాం వా యుక్తం మూర్ధ్ని సన్నిహిత హస్తేన నమస్కార కృచ్చన్ద్రాదిత్యాభ్యాం చ సహితం భోగాసనమ్. దేవ్యర్చకమునిభిః సహితమ్ రహితం వా దేవస్యపాదయోః ఊరుబద్ధవస్త్రేణ యుతం జానూపరివిన్యస్త ప్రసారిత హస్తద్వయ

సహితం వీరాసనమ్. దేవీభ్యాం రహితమర్చక మహీమార్కండేయ సహితం వీరాసనమిత్యేకే.

తా॥ వెనుక చెప్పినట్లు గర్భాగార దైవికభాగమునందలి దైవికమానుష భాగసంధిలో స్థానకాసనము నుంచునది. ఆసన ప్రకారము కూడ యోగ సుఖ భోగ వీరములని నాల్గువిధమగును. దేవేరులు లేక అర్చకమునులు మహీ మార్కండేయులుగాని మార్కండేయ పుణ్యులుగాని వీర లతో ఉండునది యోగాసనమూర్తియగును. అర్చక మునులు లేక గాని ఉండిగాని దేవేరులతో చేరిన మూర్తి సుఖాసనమనబడును. దేవేరులు అర్చక మునులతోడను పరభిత్తియందు చామరధారిణులను మాయా సంహ్లాది మునులుగాని కిష్కింధ సుందరులుగాని కలిగియుండి శిరో భాగమున నమస్కారములు చేతులు జోడించిన చంద్ర సూర్యులుకలిగి యుండెడిది భోగాసనమూర్తి యగును. దేవ్యర్చకమునులు యెవ్వరులేక మొలకుచుట్టిన వస్త్రముతో మోకాలిమీద ఉంచుకొనిన హస్తములు కలిగి యుండు మూర్తివీరాసనమూర్తియగును. దేవేరులులేక అర్చకమును లగు మహీ మార్కండేయులతో కూడినదివీరాసన మనియు అనబడును.

శయనమ్ :

కించి ద్దైవికభాగయుతం మానుష్యే స్థాప నీయం శయనమ్. తదపి యోగం భోగం వీరమితి త్రివిధమ్. ఉపధానేనిహితం దక్షిణహస్తం ప్రసారితం వామహస్తం, తదుపధానేనిహితమకుటమూర్ధ్వా ననం కించిదున్మీలితం చతుః ప్రసారితపాదం దేవం శయానం కృత్వా తదుపరి భిత్త్యూర్ధ్వ భాగే నాభిపద్మే సమాసీనం బ్రహ్మాణం తద్భిత్త్యాశ్రయాన్ పంచాయుధాన్ పాదపార్శ్వే స్థితాభ్యాం సముద్ర తరంగాచ్ఛాదిత జానుభ్యాం ఉగ్రవేగ మధుకైట భాసురాభ్యాం అర్చక మహీమార్కండేయాభ్యాం చ కుర్యాదేతద్యోగ శయనమ్. కించిద్ద్వారనిరీక్షి తాననం దక్షిణ హస్తేన ధృతమకుటం కించిత్కుంచిత ప్రసారిత వామహస్తం తదుపధానే యోజిత దక్షిణకరం అనన్త శయనే సమాసీనం పవిత్ర్యా రున్యస్తదక్షిణపాదం తథా ఆసీనంమహ్యారున్యస్త వామపాదం శయానం దేవం తత్పాదేనిహితద్వి హస్తయా పాదమర్దిన్యాశ్రియా ఖ్యాభ్యాంచ సంయుతం పూర్వవత్ బ్రహ్మాణం పంచాయుధ రూపైశ్చ సహితం కుర్యాదేతద్భోగ శయనమ్ ఉపధానే కించదస్పృష్ట మకుటం యథా తథా ఉపధానే నిహిత దక్షిణ హస్తేన ధృతమకుటం ద్వారం సమ్యక్ నిరీక్షితలోచనానమ్ విస్మ యోత్ఫుల్ల లోచనం ప్రసారిత వామహస్తం ద్విహస్తయుతం చక్రశంఖయుత హస్తాభ్యాం చతుర్హస్త యుతం వాదేవం కుర్యాదేత ద్వీర శయనం.

తా॥ పూర్వోక్తముగ భాగింపబడిన గర్భగృహమందు మానుష్యభాగమందు శయనమూర్తిని స్థాపించునది. శయ నావస్థయందును యోగము భోగము వీరమునని మూడు విధములుగ ధ్రువబేరము వ్యవహరింపబడుచున్నది. తల గడ దిండుగా అమరిన దక్షిణ హస్తమును, చాచినట్టి వామహస్తమును కలిగి తలగడ పై భాగమున స్పృశించెడి కిరీటము కలిగియు ఊర్ధ్వమునకు చూచిన ముఖము కలి గియు కొంచెముగా తెరువబడిన నేత్రములు కల్గియు బారుగా చాచిన పాదములు కలిగినదైమూర్తి శయనము నందుండ వలయును. తరువాత పై భాగమున భిత్తికి ఊర్ధ్వమందు నాభిపద్మములో ఆసీనుడైన చతుర్ముఖ బ్రహ్మయు అదే భిత్తిని ఆధారముగా జేసికొని పంచా యుధములను (కిరచరణాద్యవయవములతో)పాదపార్శ్వ మందు జానువుల పర్యన్తము సముద్రతరంగములచే ముని గిన దేహములుకలిగి భయాదరకలుషితులగు మధుకైటభు లను రాక్షసులిరువుర తోడను అర్చక స్థానీయులగుమహీ మార్కండేయుల తోడను పరివృతునిగా యోగ శయన మూర్తి పొందుపరచవగినది. కొలదిగా ద్వారము వైపుకు చూచుచున్నట్లుండి దక్షిణ హస్తముచే కిరీట

మును తాకుచుఉపధానముగ జేసికొనియు కొలదిగా చాచిన వామహస్తము కలిగి శయనముగా అనంతుని యందు ఆసీనప్రాయముగ నమరి శ్రీదేవి (పవిత్రీదేవి) ఊరువు లందుంచిన దక్షిణ పాదమును అట్లే భూదేవి (మహీదేవి) ఊరువులయందుంచి వామపాదమును అట్లుంచిన పాదముల రెంటిని ఆయాదేవులు రెండు చేతులతో సంవాహనము (పిసుకుట) చేయుచున్నట్లును పూర్వమువలె చతుర్ముఖుడు పంచాయుధవిగ్రహముల వేంచేయించబడిన మూర్తి భోగశయనమనబడును. ఉపధాన స్పర్శ కలుగని కిరీటముతో దక్షిణ హస్తమునే ఉపధానముగ జేసికొని ద్వారమువైపుకు గాఢముగా నిలచిన దృష్టిగల ముఖమును విస్మయముచే వికసించిన నేత్రములతోను చాచిన వామ హస్తము కలిగి శయనావస్థలో రెండుహస్తముల మాత్రము చేత ద్విహస్తముగా గాని శంఖ చక్రములు ధరించెడి మరి రెండు హస్తములతో చతుర్హస్తునిగా గాని దేవుని చేయుట వీరశయన మగును,

యోగాది స్థాపనాధి కారిణ :

యోగార్థీ యోగమార్గం, పుత్రార్థీ సుఖార్థీ చ సుఖమార్గం, ధనైశ్వర్యభోగార్థీ భోగమార్గం, వీర్యార్థీ వీరమార్గం విరహార్థీ విరహమార్గం ఏతేషామ భీష్ట మార్గేణ ధ్రువబేరం కుర్యాత్

ఇతి శ్రీ వైఖానసే కశ్యపప్రోక్తే జ్ఞానకాండే స్థానకాసన శయనేషు యోగాది భేదో నామం త్రిపంచాశోఽధ్యాయః

తా॥ ఈ పైన చెప్పబడి యోగాది మార్గములకు ఫలము భిన్నమైనది, యోగశక్తిని పెంపొందించి కొను నాశగల వారు యోగమార్గమును, పుత్రులను (సంతానమునకు పలక్షణము) సంసారసుఖమును కాంక్షించెడివారలు సుఖమార్గమును, ధనార్జనముచేసి ఐశ్వర్యవంతులై మనగోరిన వారలు భోగమార్గమును, శత్రువిజయాదులను కోరెడి వారలువీరమార్గమును వైరాగ్యముమ కోరినవారలు విరహమార్గమును వారల వారల చిత్త వృత్తి కనుకూలముగ నిశ్చయించికొని ఆయా మార్గములను అవలంభించి ప్రతిష్ఠచేసి ఆరాధించదగును.

ఇచ్చట పై నిరూపించిన లక్షణములలో విరహమూర్తి స్వరూపము చెప్పబడక ఫలశ్రుతియందు చేర్చబడినది ప్రతిజ్ఞయందు కూడ త్రివిధం శయనమను వాక్యమె కనుపించుచున్నది. గ్రంథాన్తర సంవాదముచేత దీనిని నిర్ణయించదగును.

ఇది యేబది మూడవ అధ్యాయము

(సశేషము)


★

(53 వ పేజీ తరువాయి)

ఉల్లమను కమలమ్ము విప్పుచు
ఉత్సవంబుగ నిన్నుగొలిచెద
ఉన్నతంబగు భావపుంజము
లుంతులాగున మనసునొసగుము!
శ్రీనివాసా మేలుకో-
ఆశ్రిత జనావళినేలుకో!

కల్కిరూపా మేలుకో!
కరివరావనయేలుకో!
నల్లనయ్యా! నిన్నుజూడగ
నామనంబున నాశబుట్టెను ॥ మేలుకో ॥
మేలుకో! హరి! మేలుకో!
మేలుకొని మమ్మేలుకో! ॥ మేలుకో ॥

Edited and Published by M. Chandramouli Reddy, Executive Officer. Tirumala Tirupati Devasthanams and Printed at T. T. D. Press, Tirupati.



Float festival of Lord Venkateswara at Tirumala.